## క్లుప్తంగా

### తహసీల్దార్‌గా రామారావు


బాధ్యతలు స్వీకరిస్తున్న వై.రామారావు

కాళేశ్వరం: మహదేవపూర్ మండల తహసీల్దార్‌గా వై.రామారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మహదేవపూర్ మండలంలో పని చేసిన తహసీల్దార్ ప్రహ్లాద్‌రాథోడ్ కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(యూ)కు ఇటీవల బదిలీ అయ్యారు. కాగా అతని స్థానంలో రామారావు వచ్చారు. రామారావు టేకుమట్ల తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వర్తించి, అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల ముందు ఖమ్మం జిల్లా ముదిగొండకు బదిలీ అయ్యారు. కాగా, నూతనంగా బాధ్యతలు తీసుకున్న తహసీల్దార్‌ను డిటీ కృష్ణ శాలువాతో సన్మానించారు. ఆయనతో సిబ్బంది పాల్గొన్నారు.

### తహసీల్దార్‌గా లక్ష్మిరాజయ్య


బాధ్యతలు స్వీకరిస్తున్న లక్ష్మిరాజయ్య

రేగొండ: కొత్తపల్లిగోరి మండల తహసీల్దార్‌గా లక్ష్మిరాజయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన తహసీల్దార్ వీరభద్రం బదిలీపై భద్రాద్రి కొత్తగూడెం వెళ్లారు. కాగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్‌ను డిప్యూటీ తహసీల్దార్ అబ్దుల్ రజాక్, జూనియర్ అసిస్టెంట్లు వెంకటేష్, రాజయ్య, అరవింద్, శ్వేత, జ్యోతి శాలువతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

### దరఖాస్తుల ఆహ్వానం

కాటారం: మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ గురుకుల బాలుర, బాలికల కళాశాలలో 2025–26 విద్యాసంవత్సరానికి సంబంధించి ఇంటర్మీడియేట్ మొదటి సంవత్సరంలో ప్రవేశం కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ రాజేందర్, నాగలక్ష్మి శుక్రవారం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. బాలుర కళాశాలలో బైపీసీ ప్రథమ సంవత్సరం విభాగంలో 30 సీట్లు, ఎంపీసీ ప్రథమ సంవత్సరం విభాగంలో 30 సీట్లు, బాలికల కళాశాలలో ఎంపీసీ విభాగంలో 12 సీట్లు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. అర్హులైన ఎస్టీ విద్యార్థులు తమ ధ్రువీకరణ పత్రాలతో కళాశాలలో నిర్వహించే కౌన్సిలింగ్‌కు హాజరుకావాలని పేర్కొన్నారు.

### దళారులను నమ్మి మోసపోవద్దు

చిట్యాల: భూమికి పట్టాలు చేయిస్తామని దళారులు చెప్పిన మాటలను ప్రజలు నమ్మి మోసపోవద్దని తహసీల్దార్ షేక్ ఇమామ్ బాబా శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన భూభారతి రెవెన్యూ సదస్సులో రైతులకు సంబంధించిన భూ సమస్యలను అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తామని డబ్బులు ఖర్చు అవుతుందని చెప్పి దళారులు ఇబ్బంది పెడతారని అలాంటి వారి మాటలు నమ్మవద్దని తెలిపారు. సమస్యలు ఉంటే రెవెన్యూ సదస్సులో దరఖాస్తు చేసుకోవచ్చునని అన్నారు. నేరుగా తహసీల్దార్ కార్యాలయంలో కూడా దరఖాస్తును సమర్పించవచ్చని తెలిపారు.

### గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

రేగొండ: మండలంలోని రామన్నగూడెం తండా శివారులోని పొలాల్లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం శుక్రవారం లభ్యమైంది. ఎస్సై సందీప్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. రామన్నగూడెం తండా శివారు పొలాలలో దుస్తులు లేని వ్యక్తి మృతదేహం కనిపించిందని తెలిపారు. ఎటువంటి ఆధారాలు లేకపోవడంతో మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం పరకాలలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# నెరవేరుతున్న సొంతింటి కల

- కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం
- సకాలంలో బిల్లుల చెల్లింపు
- హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు


నిర్మాణం తుది దశకు చేరుకున్న ఇందిరమ్మ ఇల్లు

టేకుమట్ల: నిరుపేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను కేటాయించడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో నిరుపేదలందరికీ డబుల్ బెడ్రూంలను నిర్మిస్తామని చెప్పి మండలంలోని 24 గ్రామ పంచాయితీల్లో కేవలం రాఘవాపూర్, గర్మిళ్లపల్లి, ద్వారకపేట, రామకిష్టాపూర్(వి), ఎంపేడు గ్రామాలకు మాత్రమే అనుమతులు ఇచ్చి నిర్మించారు. ఆ గ్రామాల్లో కూడా గర్మిళ్లపల్లి, రామకిష్టాపూర్, రాఘవాపూర్ మినహా ఎంపేడు, ద్వారకపేటలో అసంపూర్తిగా వదిలేయడంతో ఇప్పటికీ అలంకారప్రాయంగానే మిగిలాయి. కాగా ఎంపేడులో ఇళ్లను పూర్తి చేసేందుకు ఎమ్మెల్యే ప్రత్యేక నిధులను కేటాయించడంతో తుది దశకు చేరుకున్నాయి.

**నియోజకవర్గానికి 3500 ఇళ్లు**

ఇందిరమ్మ ఇళ్లలో మొదటిగా మోడల్ విలేజ్‌గా టేకుమట్లను ఎంపిక చేయగా 35 మంది నిర్మించుకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చారు. అనుమతి పత్రాలను సైతం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అందించారు. ఇప్పటి వరకు 21 మంది లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయి. నియోజకవర్గానికి 3500 ఇళ్లు మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో రానున్న రోజుల్లో నిరుపేదలందరికీ ఇళ్లు రానున్నాయి.

**నాలుగు దఫాలుగా బిల్లులు..**

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో బేస్‌మెంట్ వరకు పూర్తి చేసిన వెంటనే అధికారులు ఏఐ టెక్నాలజీతో ఫొటోలను అప్లోడ్ చేయగానే వారం రోజుల వ్యవధిలోనే రూ.1లక్ష నగదు లబ్ధిదారుల ఖాతాల్లో జమ అవుతోంది. రూఫ్‌లెవల్ గోడల వరకు నిర్మాణాలు పూర్తి చేస్తే రూ.1లక్ష, స్లాబ్ పూర్తి అయ్యాక రూ.2లక్షలు, ప్లాస్టరింగ్, డోర్ ఫిట్టింగ్, కలర్ వాషింగ్ పూర్తి అయ్యాక చివరి బిల్లు రూ.1లక్ష అందిస్తారు. ఇలా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ఎంత వేగంగా పూర్తి చేస్తే బిల్లులు కూడా అంతే వేగంగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ అవుతున్నాయి. దీంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**ఇంటి నిర్మాణం పూర్తయింది**



మండల కేంద్రంలోని మంజూరైన ఇందిరమ్మ ఇళ్లలో మొదటగా నిర్మాణం పూర్తి అయిన ఇల్లు నాదే. ప్రస్తుతం ప్లాస్టరింగ్ చివరి దశకు చేరుకుంది. ఇంటి నిర్మాణం కొనసాగుతుంటే బిల్లులు రావడం ఆనందంగా ఉంది. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా అధికారులే ఇంటి నిర్మాణ ఫొటోలను తీసుకుని బిల్లులు చెలిస్తున్నారు.

– మాచర్ల రాజేష్, లబ్ధిదారుడు, టేకుమట్ల

**ప్రోత్సహిస్తున్నాం..**



ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలను పూర్తి చేసుకునేందుకు ప్రోత్సహిస్తున్నాం. నిర్మాణాలను ప్రభుత్వ నిబంధనల మేరకు పూర్తి చేయగానే నిర్మాణాల ఫొటోలను అప్లోడ్ చేసి బిల్లులు వచ్చేలా కృషి చేస్తున్నాం. అలాగే నిర్మాణాల్లో జాప్యం జరుగకుండా ఇసుకు అనుమతులను జారీ చేస్తున్నాం. లబ్ధిదారులు ఎక్కడా ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– అడగాని సాంబశివుడు, పంచాయతీ కార్యదర్శి, టేకుమట్ల

# రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

- ఓబీసీ జిల్లా అధ్యక్షుడు దొంగల రాజేందర్


కొత్తపల్లిగోరిలో మొక్క నాటుతున్న నాయకులు

రేగొండ: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త కృషి చేయాలని ఓబీసీ జిల్లా అధ్యక్షుడు దొంగల రాజేందర్ అన్నారు. శుక్రవారం కొత్తపల్లిగోరి మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు సూదనబోయిన విష్ణు యాదవ్ ఆధ్వర్యంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. అనంతరం కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడి 11 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి నెల్లి వేణు, బోట్ల సుమన్, నాయకులు తిరుపతిరెడ్డి, శంకర్, కొమురయ్య, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

**రానున్న ఎన్నికల్లో గెలుపొందాలి**

చిట్యాల: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించుకోవాలని వరంగల్ పార్లమెంట్ కో కన్వీనర్ లింగంపల్లి ప్రసాద్‌రావు కోరారు. మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసమావేశానికి ముఖ్య అతిథిగా ప్రసాద్‌రావు హాజరై మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలో 11 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. ప్రధాని పేద ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఈ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మైదం శ్రీకాంత్, రావుల రాకేష్, సీనియర్ నాయకులు చెక్క నర్సయ్య, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు తీగల జగ్గయ్య, నాయకులు వల్లాల ప్రవీణ్, మాచర్ల రఘు, రాజేందర్, జైపాల్ తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలతో మానసికోల్లాసం

- బీఆర్ఎస్ నాయకుడు ప్రశాంత్


కప్ అందజేస్తున్న సిరికొండ ప్రశాంత్

చిట్యాల: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు సిరికొండ ప్రశాంత్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ ఆవరణంలో క్రికెట్ క్రీడల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్రీడలకు యువత దూరమవుతున్న నేటి పరిస్థితుల్లో క్రీడలను ప్రోత్సహించాలని సిరికొండ చాంపియన్ ట్రోఫీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గెలుపొందిన క్రీడాకారులకు మొదటి బహుమతి ట్రోఫీతో పాటు నగదు రూ.40వేలు, ద్వితీయ బహుమతి షీల్డ్‌తో పాటు నగదు రూ.20వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు చింతల రమేష్, జన్నె యుగేందర్, శశికాంత్ గౌడ్, రాములు, నిర్వాహకులు వెల్పుల రాజ్‌కుమార్, గద్దం నితిన్, లవన్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

### ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందిస్తున్న కార్మికులు

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి పట్టణానికి చెందిన సింగరేణి ఎస్ఎస్‌పీసీ కార్మికుడు నెర్పాటి మొగిలి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబానికి తోటి కార్మికులు శుక్రవారం రూ.83వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్‌పీసీ ఆఫీసర్ మురళీ మోహన్‌రావు, సినియర్ ఇన్‌స్పెక్టర్ జంగా లక్ష్మిరాజం, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

### ఎన్ఎంఎంఎస్‌కు నిఖిత ఎంపిక


మచ్చిక నిఖిత

రేగొండ : నేషనల్ మీన్స్‌కం మెరిట్ స్కాలర్ షిప్‌నకు మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలకు చెందిన మచ్చిక నిఖిత ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు కృష్ణకుమారి శుక్రవారం తెలిపారు. ప్రతి ఏడాది రూ.12వేల చొప్పున నాలుగేళ్ల పాటు స్కాలర్ షిప్ అందనున్నట్లు కృష్ణకుమారి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు దేవేందర్, సంధ్యారాణి, రాధాకృష్ణ, సాంబశివుడు, రంజాన్, సునీత, జ్యోతి, గీత, విజిత విద్యార్థినిని అభినందించారు.

# కొనసాగుతున్న గ్రామసభలు


దుబ్బపేటలో దరఖాస్తు తీసుకుంటున్న తహసీల్దార్


కొత్తపల్లిగోరి మండలం జగ్గయ్యపేటలో..

మల్హర్: మండలంలోని దుబ్బపేట, అన్సాన్‌పల్లి గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన భూభారతి రెవెన్యూ గ్రామసభలో వివిధ భూ సమస్యలపై రైతుల నుంచి 197 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. దుబ్బపేటలో 58, అన్సాన్‌పల్లిలో 139 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, ఏఎస్ఓ శివ, సిబ్బంది పాల్గొన్నారు.

రేగొండ(కొత్తపల్లిగోరి): భూ సమస్యల పరిష్కారం కోసం మండలంలో కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ లక్ష్మీరాజయ్య అన్నారు. శుక్రవారం కొత్తపల్లిగోరి మండలంలోని జగ్గయ్యపేట గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా 287 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. సదస్సులో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. రెవెన్యూ సిబ్బంది డిప్యూటీ తహసీల్దార్ అబ్దుల్ రజాక్, నేత వెంకటేష్, పకిడే రాజయ్య, మధు పాల్గొన్నారు.

కాళేశ్వరం: మహదేవపూర్ మండలంలోని బ్రహ్మణపల్లి, కన్నెపల్లి మెట్‌పల్లి గ్రామాల్లో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో శుక్రవారం 123 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ వై.రామారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేర్వేరుగా డీటీ కృష్ణ, ఆర్ఐ జగన్‌మోహన్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ సౌభాగ్యవతి, జూనియర్ అసిస్టెంట్ రఘు, బాలరాజు, భార్గవి, సంపత్, శ్యామ్, రాజబాపు, మహేందర్, రాజబాపు పాల్గొన్నారు.

### బక్రీద్ సంతోషంగా జరుపుకోవాలి

మల్హర్: బక్రీద్ పండుగను ప్రశాంత వాతవరణంలో సంతోషంగా జరపుకోవాలని కొయ్యూరు ఎస్సై నరేష్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శాంతియుత వాతావరణంలో పండుగ నిర్వహించుకోవాలని ముస్లింలకు సూచించారు.

### నేడు ఎమ్మెల్యే రాక

రేగొండ: మండలంలోని పలు గ్రామాల్లోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేయడానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు నేడు(శనివారం) రానున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సయ్య శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి లబ్ధిదారులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

# నాసిరకం విత్తనాలు విక్రయిస్తే కేసులు

గోవిందరవు పేట: రైతులకు నాసిరకం విత్తనాలు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని సీఐ రవీందర్ అన్నారు. శుక్రవారం ఎరువులు, విత్తనాల షాపుల యజమానుతో మండల వ్యవసాయ శాఖ అధికారి జితేందర్ రెడ్డి సమావేశం నిర్వహంచారు. ఈ సమావేశానికి సీఐ రవీందర్ హాజరై మాట్లాడారు. వానకాలం సీజన్‌లో రైతులకు విత్తనాలు ఎరువులు, పురుగు మందులు అందుబాటులో ఉంచాలని అన్నారు.

వెంకటాపురం(ఎం): నాసిరకం విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవని టాస్క్‌ఫోర్స్ సీఐ రమేశ్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను తహసీల్దార్ గిరిబాబు, ఎస్సై జక్కుల సతీష్, ఏఓ శైలజతో కలిసి ఆయన తనిఖీ చేశారు. అనంతరం రైతు వేదికలో రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేసి మాట్లాడారు. దళారుల వద్ద విత్తనాలు కొనుగోలు చేసి మోసపోవద్దన్నారు.

# ట్రాక్టర్ దగ్ధం


దగ్ధమవుతున్న ట్రాక్టర్

గణపురం: దుక్కి దున్నుతుండగా షార్ట్ సర్క్యూట్‌తో డీజిల్ ట్యాంకర్ పేలి ట్రాక్టర్ దగ్ధమైన సంఘటన మండలంలోని బంగ్లాపల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. బంగ్లాపల్లి గ్రామానికి చెందిన పంచనేని విష్ణువర్ధన్‌రావు అతడి భూమిలో ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్నాడు. ఈ క్రమంలో వైరు షార్ట్ సర్క్యూట్ కావడం మూలంగా ట్రాక్టర్ పూర్తిగా దగ్ధమైంది. విష్ణువర్ధన్ రావు పెద్ద ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. కాగా ట్రాక్టర్ పూర్తిగా కాలిపోయింది. సుమారు రూ.ఆరు లక్షల నష్టం వాటిల్లిట్లు బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకున్నాడు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య


చిట్యాల: జడలపేటలో బడిబాట చేపడుతున్న ఉపాధ్యాయులు


మొగుళ్లపల్లి: ఉపాధిహామీ పనుల వద్ద అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

- ఎంఈఓ కొడెపాక రఘుపతి

చిట్యాల: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని మండల విద్యాధికారి కొడెపాక రఘుపతి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయితీ కార్యాలయంలో వద్ద బడిబాట గ్రామ సభ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల తల్లిదండ్రులు తప్పకుండా ప్రభుత్వ పాఠశాలకు పంపించాలని కోరారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. అలాగే మండలంలోని జడలపేట ఉన్నత పాఠశాలలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. విద్యతోనే ఏదైనా సాధించవచ్చని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వాసంతి అన్నారు.

మల్హర్: ప్రభుత్వ పాఠశాలలోనే మెరుగైన విద్య లభిస్తుందని ఎంఈఓ లక్ష్మణ్‌బాబు అన్నారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తాడిచర్ల గ్రామంలో ఏర్పాటు చేసిన బడిబాట కార్యక్రమంలో ఎంఈఓ పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, దుస్తులు, మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ విక్రమ్‌కుమార్, తాడిచర్ల హెచ్ఎం తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.


తాడిచర్లలో..

టేకుమట్ల: ప్రభుత్వ విద్యను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి చిదిరాల సుధాకర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ ఆవరణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనందిస్తున్నారని అన్నారు. అలాగే మండలంలోని రామకిష్టాపూర్(టి)లో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఓనపాకల రవీందర్ ఆధ్వర్యంలో బడి బాట కార్యక్రమాన్ని నిర్వహించారు.

మొగుళ్లపల్లి: మండలంలోని శుక్రవారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. మొట్లపల్లిలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఎంఈఓ కుమారస్వామి పాల్గొని మాట్లాడారు. మండలంలోని పాఠశాలల్లో 100 శాతం ఉత్తీర్ణతతో పాటు వివిధ కాంపిటీటివ్ పరీక్షల్లో విజయాలు సాధిస్తున్నారని అన్నారు. గణేష్‌పల్లిలో ఉపాధిహామీ పనుల వద్దకు వెళ్లి అవగాహన కల్పించారు.


టేకుమట్ల: మాట్లాడుతున్న ఎంఈఓ సుధాకర్


రామకిష్టాపూర్(టి)లో..


ఆకినపల్లిలో..

# అధ్వానంగా పల్లె ప్రకృతి వనాలు


పిచ్చి మొక్కలతో ఉన్న పల్లె ప్రకృతి వనం


ఎండిపోయిన మొక్కలు

- ఎండిపోతున్న మొక్కలు
- పట్టించుకోని అధికారులు

వెంకటాపురం(కె): పల్లెల్లో ఆహ్లాదకర వాతావరణాన్ని ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో మండలంలో 18 పంచాయతీల్లో పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. వాటిలో పలు రకాల మొక్కలను నాటారు. కానీ క్షేత్రస్థాయిలో పల్లె ప్రకృతి వనాల పరిస్థితి అధ్వాన్నంగా తయారైయింది. లక్షల రూపాయలు ఖర్చు పెట్టి ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలను పంచాయతీ అధికారులు సిబ్బంది పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఊరి చివర ఏర్పాటు చేసి వదిలేయడంలో మొక్కలు ఎండి పోయి పిచ్చి చెట్లకు నిలయాలుగా మారాయి. పల్లె ప్రకృతి వనాలపై అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో వాటిని పట్టించుకునే వారే కరువయ్యారు. మొక్కలు నీళ్లు పట్టివారే లేరని స్థానికులు వాపోతున్నారు. పల్లె ప్రకృతి వనాలపై ఉన్నత స్థాయి అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పంచాయతీ సిబ్బంది, అధికారులు నిర్లక్ష్యం వ్యవరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైన అధికారులు పల్లె ప్రకృతి వనాలపై దృష్టి సారించి మొక్కలు బతికించేలా చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

**అధికారులు పట్టించుకోవడం లేదు..**



పల్లె ప్రకృతి వనంలో మొక్కలు ఎండిపోతున్న అధికారులు, సిబ్బంది పట్టించుకోవటం లేదు. నాటిన మొక్కలకు నీరు లేక ఎండి పోతున్నాయి. ఇప్పటికైన అధికారులు దృష్టి సారించాలి. మొక్కలకు నీరు పట్టించేందుకు సిబ్బందిని ఏర్పాటు చేయాలి.

– శ్రీను, వెంకటాపురం

### లక్ష్మణ్‌బాపూజీ విగ్రహాన్ని ఢీకొన్న వాహనం


ఒరిగిన లక్ష్మణ్‌బాపూజీ విగ్రహం

కాటారం: మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలోని స్వాతంత్ర్య సమరయోధుడు కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహాన్ని శుక్రవారం తెల్లవారుజామున గుర్తు తెలియన వాహనం ఢీకొంది. వాహనం విగ్రహం చుట్టు ఏర్పాటు చేసిన రైలింగ్‌ను బలంగా ఢీ కొట్టడంతో విగ్రహం ఒక పక్కకు ఒరిగి ప్రమాదకరంగా మారిపోయింది. కాగా, పద్మశాలి సంఘం ఈ ఘటనపై నాయకులు విచారం వ్యక్తం చేశారు. ప్రమాదవశాత్తు వాహనం ఢీకొట్టిందా లేక ఎవరైన కూల్చివేసేందుకు కుట్రపన్ని ఉంటారా అని వారు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు దీనిపై పూర్తి స్థాయిలో సమగ్ర విచారణ చేయాలని డిమాండ్ చేశారు.